

## గట్ల కానిపర్తిలో.. శివపార్వతుల కళ్యాణం

8లో..

◆ అంగరంగ వైభవంగా సాగిన వేడుకలు


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 142
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
ఫిబ్రవరి 27, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net





- రూ.3 లక్షల కోట్ల ఆర్థిక లావాదేవీలు
- శివరాత్రి స్నానాలతో ముగిసిన క్రతువు
- వివరాలు వెల్లడించిన యూపీ ప్రభుత్వం
- ఐక్యత కోసం జరిగిన మహా యజ్ఞం : ప్రధాని మోదీ

ప్రయాగ్‌రాజ్‌లోని సంగం ఒడ్డున 45 రోజుల పాటు జరిగిన మహాకుంభమేళా సంబురం ముగిసింది. ప్రపంచమంతా భారత్ వైపు చూసేలా ఈ ఆధ్యాత్మిక క్రతువు సాగింది. కోట్లాదిమంది హాజరై పుణ్యస్నానాలు చేశారు. ప్రపంచంలోనే గతంలో ఎప్పుడూ ఇలాంటి క్రతువు జరగలేదని చెప్పవచ్చు. ఓ రకంగా ఇది న భూతో..న భవిష్యత్ అన్న తీరుగా సాగింది. 144 ఏళ్లకోసారి వచ్చే మహాకుంభమేళా మహాఘట్టంలో 66కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించారు. జనవరి 13న మొదలైన ఈ మహా కుంభమేళా.. మహా శివరాత్రి పర్వదినం బుధవారంతో ముగిసింది. చివరి రోజున భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి పుణ్య స్నానాలు చేశారు. ఈ ఒక్క రోజే 2.5 కోట్లకు పైగా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించినట్లు అంచనా వేస్తున్నారు. మహా కుంభమేళా విజయవంతంగా ముగియడంతో ఎంతమంది వచ్చారన్న లెక్కలను యూపీ ప్రభుత్వం తీసింది. రూ.3 లక్షల కోట్ల ఆర్థిక లావాదేవీలు నడిచాయని పేర్కొంది. ప్రత్యక్షంగా..పరోక్షంగా 60 లక్షల మంది జీవనోపాధి పొందినట్లుగా వెల్లడించింది. – వరంగల్ వాయిస్, ప్రయాగరాజ్

వివరాలు2లో..

# భక్తకోటికి పుణ్యమేళా!

## కుంభమేళాలో 66కోట్ల మంది పుణ్యస్నానాలు





2లో..

## భార్యే నిందితురాలు

- ప్రియుడితో కలిసి స్కెచ్
- సహకరించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్
- పోలీసుల అదుపులో ముగ్గురు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరామ్ నాయక్

## ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు ..

- ఓటేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు
- కమలాపూర్ లో కాసేపు విద్యుత్ అంతరాయం
- హుజురాబాద్ లో ఓటేసిన కాంగ్రెస్ ఇంచార్జి ప్రణవ్
- పిల్లాపాపలతో పోలింగ్ కేంద్రానికి ఓటర్లు



8లో..



## ఘనంగా అన్న పూజ

నగరంలోని రంగంపేట శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం శివ పంచాయతన క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి అన్న పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పూజారి కక్కిరేణి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది నవీన్, ప్రశాంత్, కృష్ణమూర్తి, స్థానికులు శ్రీరాముల సురేష్, దుబియాల కృష్ణ, గుండు కేదారి, సనత్ కుమార్, సారయ్య, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
- వరంగల్ వాయిస్, వరంగల్

# భక్తకోటికి పుణ్యమేళా!



- కుంభమేళాలో 66కోట్ల మంది పుణ్యస్నానాలు
- రూ.3 లక్షల కోట్ల ఆర్థిక లావాదేవీలు
- శివరాత్రి స్నానాలతో ముగిసిన క్రతువు
- వివరాలు వెల్లడించిన యూపీ ప్రభుత్వం
- ఐక్యత కోసం జరిగిన మహా యజ్ఞం : ప్రధాని మోదీ

**వరంగల్ వాయిస్, ప్రయాగరాజ్ :** అట్టహాసంగా జనవరి 13న ప్రారంభమైన మహా కుంభమేళా 45 రోజుల పాటు కన్నుల పండువగా సాగింది. 144 ఏళ్లకోసారి వచ్చే మహాకుంభమేళా మహాఘట్టంలో ప్రతి ఐదుగురిలో ముగ్గురు పవిత్ర స్నానాలు చేయడం గమనార్హం. నాగ సాధువుల ఊరేగింపులు, మూడు అమృత స్నానాలతో ఈ ఉత్సవాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ప్రారంభంనుంచే దేశ, విదేశాలనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ప్రపంచమంతా భారత్ వైపు చూసేలా ఈ ఆధ్యాత్మిక క్రతువు సాగింది. మహా కుంభమేళా బుధవారం మహా శివరాత్రితో గ్రాండ్‌గా ముగిసింది. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ వాంగ్‌చుక్, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా పలువురు కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, పారిశ్రామికవేత్తలు ముకేశ్ అంబానీ, గౌతం అదానీ, సినీతారలు, క్రీడాకారులు, ఆపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ భార్య త్రివేణీసంగమంలో పుణ్యస్నానాలు చేశారు. నేపాల్ నుంచి 50 లక్షలకు పైగా భక్తులు ప్రయాగ్‌రాజ్‌ను సందర్శించగా 27 ఇతర దేశాల నుంచి రెండు లక్షలకు పైగా భక్తులు హాజరయ్యారు.

### వైమానిక విన్యాసాలు..

ముగింపు వేడుకల్లో భాగంగా భారత వాయుసేన పైలట్లు అద్భుతమైన వైమానిక విన్యాసాలు ప్రదర్శించారు. భక్తులపై హెలికాప్టర్‌తో పూలవర్షం కురిపించారు. ఏడు శైవ అఖారాలకు, మహాకుంభ్–2025 బుధవారం నాడు గొప్ప ఊరేగింపుల తర్వాత కాశీ విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలతో మహాశివరాత్రి నాడు ఉత్సవాలు ముగిసాయి.



ఊరేగింపులో భాగంగా 10 వేల మందికి పైగా నాగ సాధువులు, పండుగ ఉత్సాహాన్ని పెంచుతూ, కాశీ రోడ్ల గుండా తమ దేవతలు, జెండాలు, త్రిశూలాలు, కత్తులు, గదలను ప్రదర్శిస్తూ నృత్యం చేస్తూ ప్రదర్శన చేశారు. ఆధ్యాత్మిక యాత్రకు వచ్చే వారిలో మరింత భక్తిభావం పెంచేలా ఇలా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. మహా శివరాత్రి పర్వదినం కూడా కలిసిరావడంతో 'హర హర మహాదేవ్' నామస్మరణలతో త్రివేణీ సంగమం ఘాట్లు మార్మోగాయి. కుంభమేళాలో చివరి అమృతస్నానం ఆచరించేందుకు భక్తులు అర్ధరాత్రి నుంచే పెద్దసంఖ్యలో ఘాట్ల వద్దకు చేరుకొన్నట్లు అధికారులు తెలిపారు.

### కోట్లలో బిజినెస్..

మహా కుంభమేళ సందర్భంగా కోట్లలో బిజినెస్ నడిచింది. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగంలో దాదాపు 66 కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లుగా ప్రభుత్వం తెలిపింది. ఇందులో భాగంగానే రూ.3 లక్షల కోట్ల ఆర్థిక లావాదేవీలు నడిచాయని పేర్కొంది. పరోక్షంగా.. ప్రత్యక్షంగా 60 లక్షల మంది జీవనోపాధి పొందినట్లుగా వెల్లడించింది. దాదాపు 150 కిలో మీటర్ల మేర వ్యాపారాలు జరిగాయని పేర్కొంది.

ప్రపంచంలోనే ఇంత పెద్ద మతపరమైన పండుగ ఇదేనని పరమార్థ నికేతన్ అధ్యక్షుడు స్వామి చిదానంద సరస్వతి తెలిపారు. ప్రయాగ్‌రాజ్ ఒక చరిత్ర సృష్టించిందని చెప్పారు. యాత్రికులకు ఆర్థిక సౌలభ్యం కల్పించేందుకు 16 బ్యాంకులు ప్రాంగణంలో శాఖలను ఏర్పాటు చేశాయి. ఈ బ్యాంకుల్లో రూ.37 కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. మైదానంలో 50 మొబైల్ ఏటీఎంలతో సహా 55 ఏటీఎం బూత్‌లు ఏర్పాటు చేశారు.

### ఐక్యత కోసం జరిగిన మహా యజ్ఞం : ప్రధాని మోదీ

ఐక్యత కోసం జరిగిన మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసింది. భారతీయ ఐక్యతకు కుంభమేళా నిదర్శనంగా నిలిచింది. అంచనాలను మించి వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. భారత్ కొత్త శక్తితో ముందుకుసాగుతోందని, నవ భారత్‌ను నిర్మించే కొత్త శకం వచ్చిందని చెప్పేందుకు ఇదే నిదర్శనం అని ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని దేనితోనూ పోల్చలేం అన్నారు. త్రివేణి సంగమం నదీ తీరానికి అన్ని కోట్ల మంది ఎలా వచ్చారని యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతోంది అని పేర్కొన్నారు. ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా నిర్వహించడం అంత సులువు కాదన్నారు. మా పూజల్లో ఏదైనా లోపం ఉంటే క్షమించాలని ఆ గంగా, యమునా, సరస్వతి మాతలను ప్రార్థిస్తున్నా అని పేర్కొన్నారు. భగవంతుని స్వరూపాలుగా భావించే భక్తులకు సేవ చేయడంలో ఏదైనా లోపం ఉంటే అందుకు ప్రజలు కూడా క్షమించాలని కోరుతున్నా అని మోదీ రాసుకొచ్చారు.

# భార్యే నిందితురాలు

- ప్రియుడితో కలిసి స్కెచ్
- సహకరించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్
- పోలీసుల అదుపులో ముగ్గురు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరామ్ నాయక్

**వరంగల్ వాయిస్, క్రైం :** తమ అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రియుడితో కలిసి కట్టుకున్న భర్తను చంపాలని పథకం వేసిన భార్య ఫ్లోరాతోపాటు సహకరించిన వారిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్ తెలిపారు. గురువారం మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సంఘటనకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. హంటర్ రోడ్డులో ఉంటున్న డాక్టర్ సుమంత్ రెడ్డి షిరిడీ సాయి నగర్ లో ఉంటున్న ఫ్లోరా మరియాను 2016 సంవత్సరంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. 2018లో సంగారెడ్డిలో సుమంత్ రెడ్డి బంధువుల విద్యాసంస్థలు ఉండగా వాటిని చూసుకునేందుకు అతని భార్య ఫ్లోరాతో కలిసి సంగారెడ్డికి షిఫ్ట్ అయ్యారు. అక్కడ డాక్టర్ సుమంత్ రెడ్డి సంగారెడ్డి పీహెచ్ సీలో కాంట్రాక్టు పద్ధతిన మెడికల్ ఆఫీసర్ గా పనిచేస్తుండగా, ఫ్లోరా మరియా టీచర్ గా పనిచేస్తుండేది. బరువు తగ్గించుకోవడానికి ఆమె సంగారెడ్డిలోని సిద్ధు జిమ్ సెంటర్ కి వెళ్తుండేది. అయితే జిమ్ లో కోచ్ పని చేస్తున్న కొండాపూర్ కు చెందిన ఏర్రోల్ల శామ్యూల్ పరిచయమై వారిద్దరి మధ్య అక్రమ సంబంధానికి దారితీసింది. ఈ విషయం డాక్టర్ సుమంత్ రెడ్డికి తెలవడంతో భార్యా భర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో డాక్టర్ సుమంత్ రెడ్డి కుటుంభ సమేతంగా వరంగల్ కి షిఫ్ట్ అయ్యాడు. 2019లో ఫ్లోరా మరియారే జనగాం జిల్లాలోని పెంబర్తి సోషల్ వెల్ఫేర్ కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం లభించింది. దీంతో ఆమె అక్కడ వుండేవారు. తర్వాత సోషల్ వెల్ఫేర్ కళాశాల వరంగల్ లోని రంగశాయిపేటకు మారింది. దీంతో డాక్టర్ సుమంత్ రెడ్డి వరంగల్ లోని వాసవి కాలనీలో ఉంటూ కాజీపేటలో ప్రైవేట్ హాస్పిటల్ నడుపుకుంటూ ఉదయం వెళ్లి రాత్రి ఇంటికి వస్తుండేవాడు. ఫ్లోరా మరియా మాత్రం సంగారెడ్డిలో పరిచయమై వివాహేతర సంబంధం పెట్టుకున్న శామ్యూల్ తో తరచుగా ఫోన్లు మాట్లాడడం, వీడియో కాల్స్ మాట్లాడడం, భర్త లేని సమయంలో సదరు శామ్యూల్ ను ఇంటికి పిలిపించుకొని అతనితో సంబంధాన్ని కొనసాగిస్తోంది. విషయం తెలుసుకున్న డాక్టర్ సుమంత్ రెడ్డి ఆమెను మందలించేవారు. ఈ విషయంలో వారిద్దరికీ తరుచుగా గొడవలు జరుగుతుండేవి. దీంతో ఫ్లోరా మరియా ప్రియుడు శామ్యూల్ తో కలిసి డాక్టర్ సుమంత్ రెడ్డిని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నారు. శామ్యూల్ ఇట్టి విషయాన్ని తన స్నేహితుడైన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజ్ కుమార్ సహాయం తీసుకున్నారు. సుమంత్ రెడ్డి హత్యకు సహకరిస్తే సంగారెడ్డిలో ఇంటిని నిర్మించి ఇస్తామంటూ రాజ్ కుమార్ కు ఆశ చూపారు.

### పక్కా ప్లాన్..



సుపారీలో భాగంగా 15 రోజుల క్రితం ఒక్క లక్ష రూపాయలను ఫ్లోరా మరియా ప్రియుడు శామ్యూల్ అకౌంట్ కి ట్రాన్స్ఫర్ చేయగా అందులో నుంచి ఖర్చులకు రూ.50 వేలు శామ్యూల్ తీసుకొని, మిగిలిన రూ.50 వేలను హెడ్ కానిస్టేబుల్ రాజ్ కుమార్ కి ఇచ్చాడు. ఇందులో భాగంగా ఈనెల 20న మధ్యాహ్నం సంగారెడ్డిలో ఒక సుత్తిని కొనుగోలు చేసి రాజ్ కుమార్ కు చెందిన రాయల్ ఎన్ ఫీల్డ్ మోటార్ సైకిల్ పై కాజీపేటకు వచ్చాడు. అనుకున్న ప్రకారం సుమంత్ రెడ్డిని సీసీ కెమెరాలు, జనసంచారం లేని చీకటి ప్రదేశాన్ని ఎంచుకొని, రెక్కీ నిర్వహించారు. పథకం ప్రకారం సుమంత్ రెడ్డి రాత్రి తన క్లినిక్ ముగించుకొని కారులో బట్టుపల్లి రోడ్డు నుంచి రంగాశాయపేట వెళ్తున్న క్రమంలో బట్టుపల్లి శివారులో ఎస్సార్ స్కూల్ దాటిన తరువాత ఉన్న చిన్న బ్రిడ్జి వద్ద డాక్టర్ తన కారు వేగాన్ని తగ్గించగా అట్టి చీకటి ప్రదేశంలో అదే అదునుగా భావించిన శామ్యూల్ తనతో తెచ్చుకున్న సుత్తితో కారు వెనుక ఇండికేటర్ ను కొట్టగా అట్టి శబ్దానికి తన కారును పక్కకు ఆపి ఇండికేటర్ ను పరిశీలిస్తుండగా శామ్యూల్, రాజకుమార్ లు సదరు డాక్టర్ సుమంత్ రెడ్డిపై దాడిచేసి విచక్షణారహితంగా కొట్టి, గాయపర్చి, అతడు చనిపోయాడు అని భావించి అక్కడి నుంచి పారిపోయారు. ఈ కేసును చాలెంజ్ గా తీసుకున్న వరంగల్ ఏసీపీ నంది రామ్ ఆధ్వర్యంలో మిల్స్ కాలనీ సీఐ వెంకటరత్నం, టాస్క్ ఫోర్స్ సీఐ రంజిత్ కుమార్, మిల్స్ కాలనీ ఎస్సై సురేష్, కానిస్టేబుల్ లు బావ్ సింగ్, చంద్రశేఖర్, వెంకన్న, రాజు, జెలెందర్, టాస్క్ ఫోర్స్ కానిస్టేబుల్ ఎండీ గౌస్, టెక్నికల్ గా సహకరించిన ఏఏఓ సల్మాన్, ఐటీ కోర్ టీం కానిస్టేబుల్ నగేష్ లు ప్రత్యక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలించారు. ఈ కేసులో ఏ1 నిందితుడైన ఏర్రోల్ల శామ్యూల్, ఏ2గా గాదే ఫ్లోరా మరియా, ఏ3గా మంచుకురి రాజ్ కుమార్ ను అదుపులోకి గురువారం రిమాండ్ కు తరలించినట్లు ప్రకటించారు. ఇట్టి కేసులో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభకనభరిచిన పోలీస్ అధికారులను ఏసీపీ నందిరామ్ అభినందించారు.

3
WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, ఫిబ్రవరి 27, 2025

# కాళేశ్వరంలో మహాశివరాత్రి వేడుకలు

**▪ భారీగా తరలి వచ్చిన భక్తులు**



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తులతో సందడి నెలకొంది. మహాశివరాత్రి పర్వదినం కావడంతో ఉమ్మడి వరంగల్, హైదరాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మంచిర్యాల, మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ వంటి జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. కాళేశ్వరం త్రివేణి సంగమంలో భక్తుల పుణ్యస్నానాలు ఆచరించారు. దీప దానాలు, గోదావరి మాతకు విశేష పూజలు చేశారు. సైకత లింగలకు పూజలు చేసి ఆలయానికి చేరుకొని కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆధ్వర్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కాళేశ్వర క్షేత్రంలో మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజుల పాటు శివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఉదయం 10-00 గంటలకు మంగళవాయిద్యాలతో దీపారాధన, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం రక్షాబంధనం, దీక్షా వస్త్రధారణ రుత్విగ్వరణం మృత్సంగ్రహణము, దేవతారాధన నవకలశారాధన, నవగ్రహారాధనం, మండప దేవతారాధన, వృషభ ధ్వజారోహణం కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి వారికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్ దంపతులకు స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ తల్లిదండ్రులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించడం సంతోషంగా ఉందని తెలిపారు. మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు రవాణా, తాగునీటి సౌకర్యం, అత్యవస వైద్య సేవలు, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఏర్పాట్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణ అధికారి మహేష్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.





# శివనామ స్తోత్రాలతో మారుమోగిన శివాలయాలు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండలంలోని వివిధ శివాలయాలు బుధవారం మహాశివరాత్రి పర్వదినోత్సవం పురస్కరించుకొని భక్తుల శివనామస్మరణ లతో "శంభో శంకర హర హర మహాదేవ" స్తోత్రాలతో, ఓంకార నాదాలతో మారుమోగాయి. గణపురంలోని ఘనపేశ్వరాలయ సముదాయం (కోటగుళ్లు) ,బుద్ధారంలోని శ్రీ పర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర ఆలయం, ధర్మరావుపేటలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం, చెల్పూరులోని గ్రామ సాంబశివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు జరిగాయి. ఉదయం గంటలు 5 లకు అఖండ దీపారాధన, తోరణా బంధనం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, నిత్యార్చన స్వామివారి తిరుద్రాభిషేకం రాత్రి 8 గంటలకు గణపతి పూజ అనంతరం శివపార్వతుల కళ్యాణం కార్యక్రమాలు శాస్త్రుత్తకంగా జరిగాయి. కాగా, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శివాలయంలో జరిగిన మహాశివరాత్రి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



## చలివేంద్రం ఏర్పాటు ..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, గణపురం మండల కేంద్రంలోని కోటగుల దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని గుడికి వచ్చే భక్తుల దాహాన్ని తీర్చడానికి ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి గణపురం ఎస్సై రేఖ అశోక్ ముఖ్య అతిథులుగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే కోటగుళ్ల ఆలయ నిర్వాకులు నాగపురి శ్రీనివాస్, ఫౌండేషన్ రేగొండ మండల ఇంచార్జి ఆకుల ప్రతాప్, మంద మహేష్, సామర్ల నాగరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల వితరణ

**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని కాకతీయుల శ్రీ పట్టాభి రామాలయానికి గురువారం స్థానిక శ్రీరామ భక్తులు మాదాసు చిన్న లక్ష్మణ్ గౌడ్ దంపతులు రూ. 6000 విలువైన రెండు సీసీ కెమెరాలు వితరణ చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దయ్యాల భద్రయ్య, బూర రాజగోపాల్, మాదాసు అర్జున్ లతో పాటు ఆలయ పూజారి ముసునూరి నరేష్ ఉన్నారు.

# ఎర్రబెల్లి ప్రదీప్ రావు ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని బుధవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం (ఆకారపు గుడి)లో బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో భక్తులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బైరి నాగరాజు, బీజేపీ నాయకులు ఇనుముల అరుణ్ పాల్గొన్నారు.

# ఘనంగా శివరాత్రి ఉత్సవాలు



**వరంగల్ వాయిస్, చిట్యాల :** ఫిబ్రవరి 27 మండల కేంద్రంలోని ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం రాత్రి మహాశివరాత్రి ఉత్సవాలను దేవాలయ చైర్మన్ శృంగారపు రంగాచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూజారి రాకేష్ చారి ప్రత్యేక పూజలతో భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించి ఓం నమశ్శివాయ శివ నామస్వరనామాలతో భజన, భక్తి పాటలతో భక్తులు అలరించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జాగారాలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

# శ్రీ గట్టు మల్లికార్జున స్వామికి కడియం శ్రీహరి పూజలు



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలోని శ్రీ గట్టు మల్లికార్జున స్వామి వారిని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు స్వామి వారికీ ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి శ్రీ గట్టు మల్లికార్జున స్వామి వారి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహా శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజు మహా శివరాత్రి రోజని, అందుకనే ఈ రోజున ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో శివనామ స్మరణ చేస్తూ ఉపవాస దీక్షలు, జాగరణలు చేస్తారని తెలిపారు. ఆ దేవదేవుని ఆశీస్సులతో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ సుఖ శాంతులతో వర్ధిల్లాలని ప్రార్థించారు. మల్లికార్జున స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా రాత్రి జాగరణ కోసం మహిళలు ఎక్కువగా వస్తారని, కాబట్టి, ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్త్ ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా తాగునీరు, లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# పంచకూట శివాలయానికి విరాళం



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు మండల కేంద్రంలోని పంచకూట మహాదేవ స్వామి ఆలయానికి మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్ బుధవారం ఆలయ చైర్మన్ వంగల బుచ్చిరెడ్డికి పదివేల రూపాయలను విరాళం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారాలు అందిస్తానన్నారు. ఆలయంలో భక్తులకు సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు బూర కిషోర్, పోలు రాజేష్ కుమార్, నాగ బండి శివప్రసాద్, మాజీ ఎంపీటీసీ తోట కుమారస్వామి, బాషబోయిన సాగర్, కందగట్ల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చక్రవర్తి హాస్పిటల్‌లో పెయిన్ క్లినిక్

## ప్రారంభించిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బాలసముద్రంలోని చక్రవర్తి దవాఖాన 5వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి హాజరై నూతనంగా ఏర్పాటు చేసిన పెయిన్ క్లినిక్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలని, 5 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చక్రవర్తి దవాఖాన యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. వైద్యరంగంతో పాటు సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్న హాస్పిటల్ యాజమాన్యం డా.ఎం.తరుణ్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటుకు చిన్నారి మృతి



**వరంగల్ వాయిస్, చిట్యాల :** పాము కాటుతో ఓ చిన్నారి మృతి చెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గిద్దెముత్తారం గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కిన్నెర శిరీష – రాజు దంపతులు కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె కిన్నెర కీర్తన(7) ఉన్నారు. కాగా,కుటుంబ సమేతంగా ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి నిద్రిస్తుండగా కీర్తన పాము కాటుకు గురైంది. ఈ క్రమంలో గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన అర్ధరాత్రి ఒంటి గంటకు చిట్యాల మండలకేంద్రంలోని ప్రభుత్వ దవఖానకు తీసుకువెళ్లారు. వైద్యుల సూచనల మేరకు అక్కడి భూపాలపల్లి ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి వరంగల్ పట్టణంలోని ఎంజీఎం దవఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున సుమారు 4 గంటలకు చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అల్లారూ ముద్దుగా పెంచుకున్న బిడ్డ కండ్లముందే కానరాని లోకానికి వెళ్లడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# పోలింగ్ సరళిని పరిశీలించిన రావు పద్మ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నల్గొండ–వరంగల్–ఖమ్మం ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని బీజేపీ హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డి, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి పరిశీలించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఉన్నటువంటి పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించి, స్థానిక నాయకులను పోలింగ్ సరళి, పోలింగ్ శాతం గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# చేనేత హస్తకళలను ప్రోత్సహించాలి

## ➔ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** చేనేత హస్తకళలను ప్రోత్సహించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కేంద్రంలో ఆర్ఈసీ రోడ్డులో గల తార గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన "చేనేత హస్తకళ హ్యాండ్లూమ్ అండ్ హ్యాండిక్రాఫ్ట్ ప్రదర్శన, అమ్మకం " స్టాల్స్ లను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా



వారు మాట్లాడుతూ చేనేత హస్త కళలు పురాతనమైనవన్నారు. విభిన్న రూపాల్లో సంప్రదాయాలను చాటే చేనేత హస్తకళలను అందరూ ప్రోత్సహించి ఆదరించాలన్నారు. ప్రదర్శన ఉంచిన ఉత్పత్తులు ఎంతగానో ఆకట్టుకుందనీ, ప్రతి ఒక్కరూ ప్రదర్శనను సందర్శించి, ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం నిర్వహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని లక్ష్మా రెడ్డి, డివిజన్ అధ్యక్షులు రాజమల్లారెడ్డి, సింగారపు రవి ప్రసాద్, నాయకులు రఘుపాల్ రెడ్డి, పవన్ కుమార్, చేనేత హస్తకళల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# కన్నె రాజుకు కాకతీయ పురస్కారం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హయగ్రీవాచారి మైదానంలో ఇండస్ ఫౌండేషన్ వరంగల్ చైర్మన్, ఫౌండర్ ఏనుగుల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో కళా రాజధాని, చారిత్రక ఓరుగల్లు కేంద్రంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కాకతీయ కళవైభవాలను ప్రోత్సహించాలనే ముఖ్య ఉద్దేశంతో గత 5 సంవత్సరాలుగా మహాశివరాత్రి పర్వదినాన ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనంలో కాకతీయ సామ్రాజ్యం, శివ తత్వానికి ప్రతీక, ప్రతిష్టాత్మకమైన "కాకతీయ పురస్కారం"ను వివిధ రంగాలలో ప్రతిభను కనపరుస్తూ, సమాజంలో ఆదర్శంగా ఉంటూ, స్ఫూర్తి నింపుతూ మన ఓరుగల్లు వైభవాన్ని, తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేస్తున్న వారికి " కాకతీయ పురస్కారం " పేరు మీద అవార్డ్స్ అందిస్తున్నారు. వరంగల్ జిల్లా, ఖానాపురం మండలం, రాగంపేట గ్రామానికి చెందిన కన్నె కుమారస్వామి–రమణిల దంపతుల పెద్ద కుమారుడు వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో సిటీ ఆర్మ్డ్ రిజర్వు (ఏఆర్) పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న, బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు) గత 20 సంవత్సరాలుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ స్వయంగా 36సార్లు రక్తదానం చేయడం జరిగింది. తలసేమియా చిన్నారుల కోసం 64 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఇప్పటి వరకు అత్యవసర సమయంలో ఉన్న వారికి 17,834 మందికి ఉచితంగా రక్తం అందించారు. 5రాష్ట్రాలలో రక్తదాన పై అవగాహన కల్పించడం, దీంతోపాటు అన్నదానం, అవయవదానం, విద్యాదానం, హరితహారం, స్వచ్ఛ – భారత్, కరోనా (కోవిడ్ – 19) కష్టకాలంలో 235 మందికి ప్లాస్మాదానం చేయడం, వృద్ధాశ్రమలకు ఆర్థిక సహాయం,




జాతీయస్థాయి స్విమ్మింగ్ క్రీడలలో పాల్గొని, 2009 సంవత్సరంలో స్పోర్ట్స్ కోటాలో పోలీస్ కానిస్టేబుల్ గా ఉద్యోగం సాధించి, పోలీస్ శాఖలో ఉద్యోగం చేస్తూనే, రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలు స్విమ్మింగ్ విభాగంలో 7 పతకాలు సాధించారు. తనకు సామాజిక సేవా, క్రీడా విభాగంలో ఈ పురస్కారం రావడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఇండస్ ఫౌండేషన్ వరంగల్ చైర్మన్, ఫౌండర్ ఏనుగుల రాకేష్ రెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా " కాకతీయ పురస్కారం – 2025 "ను ప్రత్యేకంగా తన భార్య "కన్నె మమత"తో అవార్డును అందుకున్నారు.

# అన్ని దానాల కన్నా.. అన్నదానం గొప్పది



## ■ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి

**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని.. శివపార్వతుల ఆశీర్వాదంతో ప్రజలంతా సుఖ సంతోషాలతో పాటు ఆయురారోగ్యాలతో ఉండాలని జనగామ రూరల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ మోసిన్ ముస్తఫా అన్నారు. గురువారం రఘునాథపల్లి మండల కేంద్రంలోని శ్రీ మహాదేవ స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కూరెల్లి ఉపేందర్ రేణుక దంపతుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి పిండిపోలు శ్రీనివాస్ శర్మ శ్రీ మహాదేవ స్వామికి అర్చనలతో పాటు మహాదేవ స్వామికి అన్నపూజ కార్యక్రమం చేశారు. భక్తిశ్రద్ధలతో ప్రజలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథపల్లి సర్కిల్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తహసీల్దార్ మోసిన్ ముస్తఫా, సబ్ ఇన్ స్పెక్టర్ నరేష్ యాదవ్ లను ఆలయ కమిటీ శాలువాతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు చింతకిందికృష్ణమూర్తి, బస్సు చిరంజీవులు, లగిశెట్టి లింగయ్య, పోకల పోషనాదం, బాలరాజు, కొన్ని రమ, గందే మంజుల, గందే సునీత, కూరెల్లి రాధా, బచ్చు శ్రీలక్ష్మి, లగిశెట్టి వరలక్ష్మి, లగిశెట్టి మహేశ్వరి, గ్రామ మహిళలు, ప్రజలు, ప్రముఖులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, ఫిబ్రవరి 27, 2025

# తొర్రూరు టీచర్స్ క్లబ్ కు అవార్డుల పంట



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ టీచర్స్ వారు సేవా కార్యక్రమాల్లో రీజియన్ మీట్ లో అత్యధిక అవార్డులు సాధించి అందరి మన్ననలు పొంది తమకు సాటి లేరని నిరూపించారు. జిల్లా కేంద్రం మహబూబాబాద్ ఆర్తి గార్డెన్స్ లో నిర్వహించిన రామ సహాయం రీజియన్ మీట్ లో లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ టీచర్స్ కు అవార్డుల పంట పండింది. మొత్తం తొమ్మిది క్లబ్బులు ఈ రీజన్ మీట్ లో పాల్గొనగా అత్యధికంగా పదిహేడు అవార్డులు పొంది ముందు వరుసలో నిలిచినట్లు టీచర్స్ క్లబ్ అధ్యక్షుడు చింతల సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా రీజియన్ మీట్ లో నిర్వహించిన బ్యానర్ ప్రజెంటేషన్ లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి అందరినీ ఆలోచింపజేసే విధంగా ప్రయాగరాజ్, శివరాత్రి పర్వదినాలను పురస్కరించుకొని టీచర్స్ క్లబ్ వారు ఇచ్చిన బ్యానర్ ప్రెజెంటేషన్ శివుడు, సాధువులు, ఋషులు, మునులు, లక్ష్మీ నరసింహ స్వామి, వినాయకుడు వంటి వేషధారణలో పాల్గొని సభికులందరినీ అలరింపజేశారు. ఇందులో క్లబ్ ప్రెసిడెంట్ చింతల సురేష్ శంకరుడి గెటప్ లో, పూర్వ అధ్యక్షులు రాయిపెల్లి యాకయ్య ఋషి వేషధారణలో ప్రేక్షకుల మన్ననలు పొంది ఔరా అనిపించి ఆకట్టుకున్నారు. లక్ష్మీ నరసింహ స్వామి గెటప్ లో క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎద్దు వెంకన్న, వినాయకుడి వేషధారణలో క్లబ్ అడ్మినిస్ట్రేటర్ శ్రీనివాస్ నటించగా మిగతా టీచర్స్ క్లబ్ సభ్యులు సాధువులుగా పాల్గొన్నారు. గత ఏడు నెలలుగా టీచర్స్ క్లబ్ నిర్వహించి వివిధ రకాల సేవా కార్యక్రమాల ద్వారా ఉత్తమ క్లబ్ అవార్డు, వివిధ సందర్భాలలో నిర్వహించిన ఆరోగ్య శిబిరాలకు ఉత్తమ మెడికల్ క్యాంప్ అవార్డు, అవసరార్థులు, అణార్థులు ఎక్కడుంటే అక్కడ టీచర్స్ క్లబ్ ఉంటుందని మొన్న ప్రకృతి ప్రళయానికి దిక్కుతోచని స్థితిలో ఉన్న పురుషోత్తమాయగూడెం వాసులకు టీచర్స్ క్లబ్ స్పందించి సేవలు అందించారు. అందుకు గాను ఫ్లడ్ రిలీఫ్ అవార్డు, వివిధ సందర్భాలలో మానవీయ కోణంలో ఎంతోమందికి బాసటగా నిలిచి భరోసా కల్పించినందుకు హ్యూమానిటీ సర్వీస్ అవార్డు, వివిధ రకాల రుగ్మతలపై అవగాహన కల్పించినందుకు అవేర్నెస్ ప్రోగ్రాం అవార్డు, క్లబ్ టీచర్స్ క్లబ్ కాబట్టి బడుగు బలహీన వర్గాలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తూ ఎన్నో పాఠశాలల్లో పిల్లలకు అవసరమైన వస్తు సామాగ్రి కావచ్చు. అదేవిధంగా ప్రత్యేకంగా విద్యార్థులందరికీ కూడా పరీక్ష ప్యాడ్ లు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లు, జామెంట్రీ బాక్సులు వంటివి అందజేసినందుకు గాను సర్వీస్ టు స్కూల్స్ అవార్డు, అదేవిధంగా ప్రకృతిని కాపాడుతూనే మానవాళి మనగడ సాధ్యమని సమాజంలో అందరిని అందరిని మమేకం చేస్తూ నిర్వహించిన మొక్కలు నాటడం పెంచడం దిగ్విజయంగా చేసినందుకు ట్రీ ప్లాంటేషన్ అవార్డు, ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలందరికీ ప్రత్యేకంగా 10వ తరగతి విద్యార్థులందరికీ ఆల్ ఇన్ వన్ పంపిణీ, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినందుకుగాను స్టడీ మెటీరియల్ అవార్డు, అన్ని రకాల క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ నిర్వహించిన క్లబ్ గా క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ అవార్డు, డయాబెటిక్ పై అవగాహన కల్పిస్తూ డయాబెటిక్ క్యాంప్ చైర్మన్ పూర్వాధ్యక్షుడు రాయిపల్లి యాకయ్య ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నారు. నిర్విరామంగా 40 రోజులపాటు డయాబెటిక్ క్యాంపులు నిర్వహించినందుకు గాను అవేర్నెస్ టు డయాబెటిక్ అవార్డు, అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్నమో రామచంద్రా అని ఆకలితో అలమటిచ్చే అవసరార్థులకు రిలీఫ్ చైర్మన్ ఆధ్వర్యంలో తోట రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన అందరు రిలీఫ్ కార్యక్రమాల గాను సర్వీస్ టు అందరు రిలీఫ్ అవార్డు ఈ కార్యక్రమాలన్నీ తన భుజస్కందాలపై వేసుకొని అన్ని రకాల క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ సర్వీస్ టు స్కూల్స్ లైన్స్ మిత్రులందరికీ కోఆర్డినేట్ చేస్తూ క్లబ్బును దిగ్విజయంగా ముందుకు నడిపిస్తున్న ప్రెసిడెంట్ చింతల సురేష్ ను అవుట్ స్టాండింగ్ ప్రెసిడెంట్ గా, ప్రధాన కార్యదర్శిని వెలిదే సురేష్ కుమార్, అవుట్ స్టాండింగ్ సెక్రటరీగా, కోశాధికారి ఎద్దు వెంకన్నను అవుట్ స్టాండింగ్ ట్రెజరర్ గా, రీజియన్ లోనే అత్యధిక సేవా కార్యక్రమాలు నిర్వహించి ఉత్తమ సేవలందిస్తున్నందుకు టీచర్స్ క్లబ్ ను ఉత్తమ క్లబ్ గా అవార్డులతో, లయన్స్ క్లబ్ ఆఫ్ టీచర్స్ పూర్వ అధ్యక్షులు రాయపెల్లి యాకయ్యను ఉత్తమ సేవకుడి అవార్డుతో, అదే విధంగా టీచర్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొంటూ అన్ని రకాల కార్యక్రమాల్లో పాల్గొన్నందుకుగాను తోట రమేష్ ను కమిటెడ్ లయన్ గా గుర్తించి అవార్డుతో సత్కరించడం జరిగింది. ఈ విధంగా క్లబ్బు వివిధ రంగాలలో సేవలు అందించినందుకు గాను మొత్తం పదిహేడు అవార్డులతో రీజియన్ లోనే ప్రథమ స్థానం లో నిలిచినందున రీజియన్ చైర్మన్ రామ సహాయం వెంకట్ రెడ్డి చేతుల మీదుగా అవార్డులన్నీ అందుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ప్రపంచ ప్రఖ్యాత మిమిక్రీ ఆర్టిస్ట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

## ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జరుగుతున్న పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ సందర్శించారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలు మరియు ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి ఎస్పీ భద్రత పరమైన పలు సూచనలు చేశారు. ఎస్పీతో ఎస్బీ ఇన్ స్పెక్టర్ చంద్రమౌళి, టౌన్ ఇన్ స్పెక్టర్ దేవేందర్ ఉన్నారు.

# పోలింగ్ తీరుపై అరూరి ఆరా..



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉమ్మడి నల్గొండ – వరంగల్ – ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గురువారం వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో ఇస్లామియా జూనియర్ కాలేజ్ లో ఓటింగ్ సరళిని బీజేపీ అభ్యర్థి పులి సరోత్తం రెడ్డితో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ పరిశీలించారు. వీరి వెంట వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# ఆర్టీసీకీ రూ.4 లక్షలకు పైగా ఆదాయం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహా శివరాత్రి పండుగ కురవి జాతర సందర్భంగా మహబూబాబాద్ డిపో నుంచి రోజున 20 స్పెషల్ బస్సులతో 207 ట్రిప్పులతో 5236 కిలోమీటర్లు తిప్పి 14467 మంది ప్రయాణికులను చేరవేసి రూ. 4,16,592 ఆదాయం తెచ్చారు. ఇందులో మహిళా ప్రయాణికుల ద్వారా ఆదాయం రూ.2,71,240/, ఫేర్ పైడ్ ఆదాయం 1,45,352తో ఈపీకే 79.56తో, ఓఆర్ 126% సాధించారని డిపో మేనేజర్ ఎం. శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కురవి జాతరను ఎటువంటి ఇబ్బంది లేకుండా పూర్తి చేసినందుకు, ఆదాయం ఎక్కువగా తీసుకురావడానికి ప్రయత్నం చేసిన ప్రతి ఒక్క కండక్టర్, డ్రైవర్, డిపో ఉద్యోగస్తులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. టీజీఎస్ఆర్టీసీ బస్సులను ఆదరించిన ప్రయాణికులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# కిరాణం స్టోర్ ను ప్రారంభించిన కుడా చైర్మన్



**వరంగల్ వాయిస్, సంగెం :** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఎండీ.రియాజ్, ప్రశాంత్ ల జనరల్ కిరాణం స్టోర్ ను వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి ప్రారంభించారు. అనంతరం షాప్ యజమాని కుడా చైర్మన్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

# యువ నేత విష్ణువర్ధన్ విస్తృత పర్యటన



**వరంగల్ వాయిస్, కాజీపేట :** గ్రేటర్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 47వ డివిజన్ లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణు వర్ధన్ రెడ్డి గురువారం విస్తృత పర్యటన చేశారు. ప్రతి కాలనీలో ప్రత్యక్షంగా కలియ తిరుగుతూ ప్రజలను కలుస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. డీజిల్ కాలనీలో శాంతి నగర్ వెళ్లే మార్గంలో ఉన్న రోడ్డు సమస్యను స్థానిక కాలనీవాసులు వారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే రైల్వే అధికారులు కలిసి డీజిల్ కాలనీ లోకో షెడ్ డీఎంఈ ఎన్వీ వెంకట కుమార్, కాజీపేట ఏడీఏ రామకృష్ణ రాజ్ లను మర్యాదపూర్వకంగా కలసి ప్రజలను అడ్డుగా ఉన్న ఫోల్స్ తొలగించేలా చూడాలని కోరారు. ప్రధానంగా ఉండే విద్యుత్తు, నీటి, పారిశుధ్య పనుల పురోగతులపై ఆరా తీశారు. అధికారులు వెంటనే వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం బాపూజీ నగర్ కి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంపెల్లి లక్ష్మణ్, డీజిల్ కాలనీకి చెందిన గోపి అనారోగ్యంతో చికిత్స పొంది తిరిగి ఇంటికి వచ్చిన క్రమంలో వారిని పరామర్శించారు. బోడగుట్టకి చెందిన గొల్లెడ్ల సత్తిరెడ్డి మాతృమూర్తి రాజమ్మ ఇటీవలే మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వారితో సీనియర్ నాయకులు ఎండీ అంకూస్, 47వ డివిజన్ అధ్యక్షుడు షేక్ అస్గర్, సీనియర్ నాయకులు మైసారపు సిరిల్ లారెన్స్, ఇప్ప శ్రీకాంత్, దొంగల కుమార్, తిరుపతి శ్రీనివాస్, తమ్ముడి మధు బబ్లూ, శోభనాబోయిన భిక్షపతి, భూషాపక శ్రీనివాస్, కొమురవెల్లి రమేష్, బొబ్బిలి నాగరాజు, వాలిశెట్టి సాయినాథ్, భాను చందర్, బిడారి రాజేందర్, యముడల హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రాల నెపంతో వీరమ్మను చంపిన దుండగులను శిక్షించాలి

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మంత్రాలు చేస్తున్నదనే అనుమానంతో సారపాక వీరమ్మను దారుణంగా హత్య చేయడాన్ని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్రంగా ఖండించారు. దుండగులను కఠినంగా శిక్షించి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గరిమిళ్లపల్లి శివారు గ్రామమైన బోయినపల్లికి చెందిన సారపాక వీరమ్మను మంత్రాలు చేస్తున్నదని అనుమానంతో గొంతు నులిమి చంపి గోనె సంచిలో కుక్కి బావిలో పడేయడం అత్యంత దారుణం అన్నారు. అదే గ్రామానికి చెందిన బోయిన మల్లయ్య తన కుమార్తె అనారోగ్యంతో ఉంటే అందుకు వీరమ్మ మంత్రాలు చేయడమే కారణమని భావించి వారి బంధువులతో కలిసి ఈ దారుణానికి పాల్పడి నిండు ప్రాణాన్ని బలిగొనడం దుర్మార్గమన్నారు. హత్యకు గురైన వీరమ్మ కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్ గ్రేషియో ఇచ్చి వారిని అన్ని విధాల ఆదుకోవాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



**వరంగల్ వాయిస్, ఎనుమాముల :** పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్ కు చెందిన జక్కోజు శివ కృష్ణ చారి(31) కూలీ పని చేస్తుండేవాడు. ఈ క్రమంలో తరచు మద్యం సేవించేవాడు. మద్యానికి బానిసై రోజు ఇంట్లో భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో నిన్నటి సాయత్రం మృతుడి భార్య, తల్లి ఇంటి ముందు కూర్చున్నప్పుడు మద్యం తాగి ఇంటికి వచ్చి ఇంటి లోపలికి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. పడుకున్నాడని అనుకొని కొద్ది సేపటి తరువాత తలుపులు తీయకపోయే సరికి కిటికీలోంచి చూడగా ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకొని చనిపోయాడని మృతుడి భార్య జక్కోజు లావణ్య తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎనుమాముల ఇన్స్పెక్టర్ ఎ.రాఘువేందర్ తెలిపారు.

## మోగిపురుగు నియంత్రణకు క్షేత్ర ప్రదర్శన



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** వరిలో మోగి పురుగు నియంత్రణ, పిలికలు, వేరు వ్యవస్థ అభివృద్ధి డియర్ బి కోటాతో సాధ్యమని బేయర్ ప్రతినిధులు అన్నారు. వరంగల్ జిల్లా, చెన్నారావుపేట మండలం, అక్కలచెడ గ్రామంలో బేయర్ నూతన ఉత్పాదన అయినటువంటి బి.కోటపై క్షేత్ర ప్రదర్శన చేశారు. ఈ క్షేత్ర ప్రదర్శనకు సుమారు 100 మంది రైతులు వచ్చారు. ఈ క్షేత్ర ప్రదర్శనలో రైతు వారి పద్ధతి, అదేవిధంగా బాయర్ కంపెనీ వారి బికోట వాడిన పద్ధతినీ పరిశీలించారు. రైతులు నేరుగా పొలం లోకి దిగి, బికోట వాడిన పొలంలో మోగి పురుగు లేదని, పిలికలు అధికంగా అభివృద్ధి చెందాయని, పచ్చదనం ఉందని ,దృఢమైన వేరు వ్యవస్థ ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రీజినల్ మేనేజర్ టి.ఆశోక్ రెడ్డి, పి.నారాయణ రెడ్డి, సీసీఎం జి.సతీష్, శివేష్ తో పాటు బాయర్ సీడ్ ప్రొడక్షన్ టీం కూడా పాల్గొన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన కుడా చైర్మన్ ఇనగాల



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన పెండెల శ్రవణ్ కుమార్ కూతురు శారీ ఫంక్షన్ కు వారి స్వగృహంలో హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కీ.శే. భయ్యా తిరుపతి దశదిన కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు. పరకాల పట్టణానికి చెందిన బొచ్చు సదానందం ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని కలిసి పరామర్శించారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** రాయపర్తి మండలం బురాన్ పల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పిట్టల సుధాకర్ తండ్రి పిట్టల సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర మాజీ మంత్రి, పాలకుర్తి బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. అలాగే రాయపర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకుడు ఐత రాకేష్ తండ్రి ఐత ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో చనిపోగా వారి కుటుంబ సభ్యులను ఎర్రబెల్లి పరామర్శించి ఓదార్చారు. మాజీ మంత్రి వెంట తాజా మాజీ జడ్పీటీసీ రంగు కుమార్, రాయపర్తి మాజీ ఎంపీటీసీ ఐత రాం చంద్రు, యలమంచి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు

**వరంగల్ వాయిస్, ములుగు :** వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం నిర్వహించగా ములుగు జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఓటు హక్కు కలిగిన ఓటర్లు గురువారం ఉదయం నుండే పోలింగ్ కేంద్రాల ముందు ఓటు హక్కు వినియోగించుకోవడానికి బారులు తీరారు. జిల్లాలో మొత్తం 628 మంది ఓటర్లు ఉండగా 92.83 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం ఎన్నికలు పురస్కరించుకొని జిల్లా యంత్రాంగం బుధవారం మధ్యాహ్నం వరకే పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ పత్రాలతో పాటు ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న సిబ్బందిని ప్రత్యేక బస్సుల ద్వారా జిల్లాలోని 9 మండల కేంద్రాలకు తరలించారు.ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఎన్నిక సాయంకాలం నాలుగు గంటలు సమయంలో ముగిసింది.



### డోర్నకలో..

వరంగల్ ఖమ్మం నల్గొండ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ప్రభుత్వ,ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రధానంగా యూటీఎఫ్ బలపరిచిన అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి, భాజపా బలపరిచిన అభ్యర్థి పులి సర్వోత్తం రెడ్డి మధ్య తీవ్రమైన పోటీ నెలకొని ఉన్నట్లు ఉపాధ్యాయ లోకం భావిస్తుంది. ఇటీవల పండిట్లు, పీఈటీలకు ప్రమోషన్ కల్పించే విషయంలో ముందుండి పోరాడిన గాలి రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి కూడా గణనీయమైన పోటీ అందించినట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా పీఆర్టీయూ మాజీ రాష్ట్ర అధ్యక్షులు పులి సర్వోత్తంరెడ్డి బీజేపీ బలపర్చిన అభ్యర్థిగా పోటీ చేయగా వరంగల్ పీఆర్టీయూ నుంచి అత్యధిక ఓట్లు లభించాయని తెలుస్తుంది. ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి తాజా మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ముందంజులో ఉండే అవకాశం ఉంది.

### మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా..

ఎన్నికల పోలింగ్ ప్రక్రియ మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా కొనసాగుతోంది. పోలింగ్ ప్రక్రియ బ్యాలెట్ రూపంలో కొనసాగుతున్న నేపథ్యంలో మందకోడిగా కొనసాగుతుంది. మహబూబాబాద్ జిల్లా లోని 16 పోలింగ్ కేంద్రాల్లో 1663 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 144 సెక్షన్ ను విధించి , భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలైన ఓట్లు 1571 కాగా, సాయంత్రం 4 గంటల వరకు 94.47 పోలింగ్ శాతం నమోదైంది.

### పరకాలలో..

నల్గొండ-వరంగల్- ఖమ్మం ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గురువారం పరకాల పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీజేపీ బలపరిచిన అభ్యర్థి పులి సరోత్తం రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తూ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో పరకాల పట్టణ బీజేపీ నాయకులు కోరారు. పరకాల కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు , రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు కొండేటి శ్రీధర్, డాక్టర్ సంతోష్ కుమార్ పరకాల 27వ బూత్ ను సందర్శించి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, పరకాల పట్టణ నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మల్హార్ మండలంలో ..



మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని కొయ్యూరు ఎమ్మార్సీ బిల్డింగ్ లో నిర్వహించిన పోలింగ్ లో పట్టభద్రుల స్థానానికి 584 ఓట్లకు గాను 440 ఓట్లు, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 2ఓట్లకు గాను 2 ఓట్లు పోలైనట్టు అధికారులు తెలిపారు. కొయ్యూరు ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.






## యోగా గురువు శ్రీనివాస్‌కు కాకతీయ పురస్కారం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత 25 సంవత్సరాలుగా యోగాలో పోశాల శ్రీనివాస్ చేస్తున్న విశేష సేవలను గుర్తించిన ఇండస్ ఫౌండేషన్ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా హనుమకొండలో జరిగిన కార్యక్రమంలో కాకతీయ పురస్కారాన్నిఅందజేశారు. ముఖ్య అతిథి మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు చేతుల మీదుగా ఈ అవార్డును ఆయన స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఇండస్ ఫౌండేషన్ అధినేత ఏనుగుల రాకేష్ రెడ్డి, సీఎస్ రంగరాజన్ చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు, స్వామి ప్రణవానంద దాస్ , జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు, ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత సమ్మయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్ రావు, తాటికొండ.రాజయ్య, వొడితల సతీష్ బాబు పాల్గొన్నారు.

## దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆజాద్‌ది కీలకపాత్ర

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చంద్రశేఖర్ ఆజాద్ కీలకపాత్ర పోషించారని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి అన్నారు. సీపీఐ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ 94వ వర్ధంతి బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చంద్రశేఖర్ ఆజాద్ ఆశయ సాధన కోసం నేటి యువత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు మునగాల భిక్షపతి, నేదునూరి రాజమౌళి, కొట్టేపాక రవి, బత్తిని సదానందం, వేల్పుల సారంగపాణి, మాలోత్ శంకర్ నాయక్, దామెర సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



# లోహర్ జాతకం మారిపోయింది!



మూడేళ్ళ క్రితం శ్రీవిష్ణు మూవీ 'అల్లూరి'లో నటించిన కాయదు లోహర్ తాజాగా 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' మూవీతో మరోసారి తెలుగువారిని పలకరించింది. ఈ సారి ఈ మూవీని తెలుగువాళ్ళు బాగానే ఆదరించారు. తమిళ డబ్బింగ్ సినిమా అయినా... గత వారం విడుదలైన సినిమాలలో కాస్తంత ఆదరణ దీనికే లభించింది. దాంతో కాయదు లోహర్ పై మన నిర్మాతలు దృష్టి సారించారు. మరీ ముఖ్యంగా కాయదు తెలుగులో ఓ క్రేజీ ప్రాజెక్ట్ కు సైన్ చేసినట్టు తెలుస్తోంది. ఈ విషయాన్ని డైరెక్ట్ గా కాయదు చెప్పలేదు కానీ ఓ తెలుగు సినిమాలో తనకు ఛాన్స్ లభించిందని తెలిపింది. ఈశాన్య భారత్ లో పుట్టిన కాయదు లోహర్ పెరిగింది పూణేలో. అయితే ఇప్పటికే అమ్మడు దక్షిణాది చిత్రాలను చుట్టేసింది. ఏ భాషా చిత్రంలో నటించానా ఆ భాషను నేర్చుకోవడానికి కాయదు గట్టిగా ప్రయత్నిస్తుంది. అలా ఇప్పటికే చక్కగా తమిళం మాట్లాడేస్తోంది. తెలుగులో 'అల్లూరి'లో నటించే సమయంలో కాస్తంత మన భాషనూ అర్థం చేసుకునే స్థితికి చేరింది. ఇప్పుడిప్పుడే క్యూట్ క్యూట్ గా తెలుగు పదాలను పలుకుతోంది. ఇంతకూ విషయం ఏమంటే... విశ్వక్ సేన్‌హీరోగా కె.వి. అనుదీప్ దర్శకత్వంలో సితార ఎంటర్ టైన్ మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న 'ఫంకీ' మూవీలో కాయదు ఛాన్స్ దక్కించుకుంది. ఇవాళ సితార ఎంటర్ టైన్ మెంట్ సంస్థలోకి ఏ హీరోయిన్ అయినా అడుగుపెడితే... వాళ్ళ జాతకం మామూలుగా ఉండటం లేదు. వరుసగా అదే బ్యానర్ లో సినిమా ఛాన్సులు దక్కడమే కాదు... కలిసొస్తే... స్టార్ హీరోల పక్కన కూడా అవకాశం లభిస్తుంటుంది. అంత గొప్ప ఛాన్స్ దక్కడం పట్ల కాయదు ఫుల్ ఖుషీలో ఉంది.


# రజనీకాంత్ సరసన పూజా హెగ్డె ఫిక్స్

అధికారికంగా తెలిపిన కూలీ మూవీ టీం రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ'. నాగార్జున, శ్రుతిహాసన్, సత్యరాజ్, ఉపేంద్ర తదితరులు కీలక పాత్రధారులు. ఆ సినిమాలో పూజా హెగ్డే నటించనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే! అయితే ఇప్పుడు ఈ చిత్రంలో పూజా ఫిక్స్ అయ్యారు. ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా తెలిపింది. దీనికి సంబంధించి ఓ ప్రీ లుక్ పోస్టర్ విడుదల చేసి ఈ స్టార్ హీరోయిన్ ఎవరో గుర్తుపట్టాలంటూ పోస్ట్ పెట్టింది. తాజాగా ఆ ప్రీ లునిక్ పోస్టర్ పూజా హెగ్డేదేనంటూ ఖరారు చేశారు. ఇందులో పూజా ఇందులో కీలక పాత్రలో నటించనున్నారా, ప్రత్యేక గీతంలో కనిపించనున్నారా అనేది తెలియాల్సి ఉంది. అనిరుధ్ ఈ సినిమాకు 'జైలర్'లోని 'కావాలయ్యా' పాట తరహాలో ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. బంగారం స్మగ్లింగ్ అంశంతో ముడిపడి ఉన్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో.. రజనీ పవర్‌ఫుల్ రోల్‌లో కనిపిస్తారు. ఆమిర్‌ఖాన్, నాగార్జున, ఉపేంద్ర, శ్రుతిహాసన్ తదితరులు కీలక పాత్రలు ఆగస్టులో రిలీజ్ చేసే అవకాశం ఉంది.



# అమీషా పటేల్‌కు చేదు అనుభవం






బాలీవుడ్ నటి అమీషా పటేల్‌కు చేదు అనుభవం ఎదురైంది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివుడిని దర్శించుకునేందుకు ముంబై జుహూలోని ఓ శివాలయానికి వెళ్లారు అమీషా పటేల్. ఇక అమీషా పటేల్ వచ్చిందని తెలిసిన అక్కడి భక్తులు, బాబాలు ఒక్కసారిగా ఆమెని చూసేందుకు ఎగబడ్డారు. అమీషా ఆలయంలో పూజలు చేస్తున్న సమయంలో అమెతో ఫొటోలు దిగేందుకు ఫ్యాన్స్‌తో పాటు సాధువులు సైతం పోటీ పడ్డారు. ఒక్కసారిగా ఆమెను చుట్టుముట్టి ఫొటోలు తీసుకున్నారు. అయితే సెల్ఫీల కోసం జనాలు ఎగపడటంతో అమీషా చాలా ఇబ్బంది పడిరది. అది గమనించిన టెంపుల్ సెక్యూరిటీ వారిని చెదరగొట్టే ప్రయత్నం చేయడంతో పాటు. అమీషాతో సెల్ఫీ దిగేందుకు ముందుకు వచ్చిన ఒక సాధువుని అక్కడి నుంచి లాక్కెల్లారు. ఇక బాబా నుంచి తనను రక్షించినందుకు టెంపుల్ సెక్యూరిటీ సిబ్బందికి అమీషా పటేల్ కృతజ్ఞతలు తెలిపింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. సినిమాల విషయానికి వస్తే.. ఇటీవలే గదర్ 2 సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకుంది అమీషా పటేల్. సన్నీ డియోల్ హీరోగా వచ్చిన ఈ చిత్రంలో అమీషా కథానాయికగా నటించింది. అనిల్ శర్మ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం దాదాపు రూ.600 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది.


# రాజమౌళిపై సంచలన కామెంట్స్

**ఆయన వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ నోట్**



టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు రాజమౌళి, ఆయన సతీమణి రమా రాజమౌళి వివాదంలో చిక్కుకున్నారు. జక్కన్న స్నేహితుడైన యు.శ్రీనివాస్ రావు రాజమౌళి టార్చర్ భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సుసైడ్ నోట్ రాయడంతో పాటు సెల్ఫీ వీడియో తీసి విడుదల చేయడం సంచలనంగా మారింది. రాజమౌళిది నాది 34 ఏళ్ళ స్నేహం. ఈటీవీలో రాజమౌళి శాంతి నివాసం సీరియల్ చెయ్యక ముందు నుంచే మేం ఇద్దరం ఫ్రెండ్స్. ఈ విషయం అందరికి తెలుసు. యమదొంగ సినిమాకి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా నేను చేశాను. కానీ రాజమౌళి జీవితంలో ఒక మహిళ ప్రవేశించడంతో నన్ను దూరం పెట్టారు. రాజమౌళి స్టార్ డైరెక్టర్ అయ్యాక ఈ విషయం ఎవరికైనా చెప్తానని.. నన్ను ఇండస్ట్రీలో లేకుండా చేశాడు. చివరకి నేను చనిపోయే దాకా తెచ్చాడు. పోలీసులు కేసు ఫైల్ చేసి రాజమౌళికి రమ రాజమౌళికి లై డిటెక్టర్ టెస్ట్ చెయ్యాలి అంటూ సుసైడ్ నోట్‌లో రాసుకోచ్చాడు. రాజమౌళి క్షుద్ర విద్యలని వచ్చని.. అతడికి అడ్డుగా వస్తారని అనుకున్న దర్శకులందరనీ పక్కకు తప్పించి తానే నెంబర్ వన్ డైరెక్ట్ అయ్యాడని తెలిపాడు.

# ఆస్కార్ విన్నర్ జీన్ హ్యాక్‌మాన్ మృతి



రెండు సార్లు అస్కార్ అవార్డు అందుకున్న జీన్ హ్యాక్‌మాన్.. అమెరికాలోని తన నివాసంలో శవమై తేలాడు. న్యూమెక్సికోలోని శాంటా ఫీ ఇంట్లో అతని మృతదేహాన్ని గుర్తించారు. ఆయన భార్య బెట్సీ అరకావా, కుక్క కూడా ఆ ఇంట్లో ప్రాణాలు కోల్పోయి ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. శాంటా ఫీ కౌంటీ పోలీసు అధికారి ఆడన్ మెండోజా ముగ్గురి మరణాలను ధ్రువీకరించారు. ప్రస్తుతం ఈ కేసు విచారణలో ఉన్నట్లు చెప్పారు. ద ఫ్రెంచ్ కనెక్షన్ చిత్రంలో నటించిన హ్యాక్‌మాన్‌కు ఆస్కార్స్‌లో బెస్ట్ యాక్టర్ అవార్డు దక్కింది. ఇక అన్‌ఫర్గీవన్ చిత్రంలో ఆయన బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్ అవార్డు దక్కింది. ఆస్కార్స్‌తో పాటు రెండు సార్లు బాఫ్టా, నాలుగు గోల్డెన్ గ్లోబ్ అవార్డులు గెలుచుకున్నాడు.

# ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు ..

- ఓటేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు
- కమలాపూర్ లో కాసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం
- హుజురాబాద్ లో ఓటేసిన కాంగ్రెస్ ఇంచార్జి ప్రణవ్
- పిల్లాపాపలతో పోలింగ్ కేంద్రానికి ఓటర్లు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాయి. కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజాంబాద్ గ్రాడ్యుయేట్ ఎన్నికల ఓటింగ్ కు ఓటర్లు పోటెత్తారు. కమలాపూర్ లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభంలో కరెంట్ సరఫరా అంతరాయం కాగా ఓటర్లు ఇబ్బంది పడ్డారు. ఓటేసేందుకు ఓటర్లు పిల్లాపాపలతో పోలింగ్ కేంద్రాలకు తరలిరాగా గంటల కొద్ది క్యూ లైన్ లో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హుజురాబాద్ లో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితెల ప్రణవ్ బాబు ఓటేశారు. పోలింగ్ ప్రారంభంలో ఓటింగ్ మందకోడిగా సాగినప్పటికీ 11 గంటల నుంచి ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. ఓటింగ్ సరళిని ఎప్పటికప్పుడు ఎన్నికల ఆఫీసర్లు పర్యవేక్షించారు.

### హనుమకొండలో..

వరంగల్–ఖమ్మం–నల్గొండ టీచర్స్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన మాజీ కుడా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజ్ యాదవ్ హనుమకొండ జిల్లా పరిధిలోని పలు కేంద్రాలను పరిశీలించారు. ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ కేంద్రంలో ఉన్న వారందరికీ ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు.



- వరంగల్ లో 94.13శాతం..
- హనుమకొండలో 91.66 శాతం ఓటింగ్
- ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్లు, సీపీ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం వరంగల్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయి. ఓటు హక్కు కలిగిన ఉపాధ్యాయ ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల ముందు బారులు తీరారు. జిల్లాలో మొత్తం 2,352 మంది ఓటర్లు ఉండగా 2,214 మంది ఓటు వేశారు. 94.13 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. వరంగల్ జిల్లాలోని 13 మండలాల్లో ఏర్పాటు చేసిన 13 పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న ఓటింగ్ సరళిని వీక్షించడంతో పాటు సెంట్రల్ డీసీపీ షేక్ సలిమాతో కలిసి వరంగల్ పట్టణంలోని ఇస్లామియా కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్స్ లను ప్రత్యేక వాహనాల్లో భారీ బందోబస్తు మధ్య నల్గొండ జిల్లా కేంద్రానికి తరలించారు.



### హనుమకొండలో..

జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు 15 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ సాగింది. హనుమకొండలోని యూనివర్సిటీ లా కాలేజీ, కాకతీయ డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావిణ్య సందర్శించి పోలింగ్ సరళిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి జిల్లాలో 5,215 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా ఇందులో 4,780 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీనికి సంబంధించి 91.66 శాతం ఓటింగ్ నమోదైంది. అదే విధంగా మెదక్–నిజామాబాద్–కరీంనగర్–ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి జిల్లాలోని నాలుగు మండలాలైన భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, వేలేరు మండలాల్లో 166 ఓట్లు ఉండగా 103 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఈ మండలాల్లో 62.05 శాతం ఓటింగ్ నమోదైంది. మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి జిల్లాలోని నాలుగు మండలాలైన భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, వేలేరు మండలాల్లో 4,585 మంది ఓటర్లు ఉండగా 1,780 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 38.82 ఓటింగ్ శాతం నమోదైంది.

### పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన సీపీ..

ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన బందోబస్త్ తీరును పరిశీలించారు. ఈ కేంద్రంలో ఎన్నికలు జరుగుతున్న తీరును పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.







## గట్ల కానిపర్తిలో.. శివపార్వతుల కళ్యాణం

- అంగరంగ వైభవంగా సాగిన వేడుకలు

**వరంగల్ వాయిస్, శాయంపేట :** మహా శివరాత్రిని పురస్కరించుకొని శాయంపేట మండలం గట్ల కానిపర్తి గ్రామంలోని శ్రీ భోగేశ్వర, చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఓం నమశ్శివాయ.. హర హర మహాదేవ.. శంభో శంకర తదితర శివనామ స్మరణతో ఆలయం మారు మోగింది. గడ్డం స్వప్న, ప్రశాంత్ దంపతులు పరమేశ్వరుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీరు శివపార్వతుల కళ్యాణాన్ని వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం లక్ష్మినారాయణ–జయలక్ష్మి, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి–సంధ్యారాణి దంపతులతోపాటు గట్ల కానిపర్తి గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని తరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం లక్ష్మినారాయణ మాట్లాడుతూ ఈ కార్యక్రమం శివ తత్వాన్ని మరింత పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఆలయ విశిష్టత, శివ తత్వాన్ని, ఔన్నత్వాన్ని భావితరాలకు అందించాలన్న సంకల్పంతో గత పదేళ్లుగా శ్రీ భోగేశ్వర చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.



## 28 నుంచి నిట్ లో స్ప్రింగ్ స్ప్రీ

- ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్న కళాప్రదర్శనలు

**వరంగల్ వాయిస్, నిట్ :** నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) వరంగల్ లో ప్రతిష్టాత్మక సాంస్కృతిక ఉత్సవం 'స్ప్రింగ్ స్ప్రీ 2025' ఫిబ్రవరి 28 నుంచి మార్చి 2 వరకు నిర్వహించనున్నారు. 1978లో ఆవిర్భవించిన స్ప్రింగ్ స్ప్రీ దక్షిణ భారతదేశంలో అతిపెద్ద సాంస్కృతిక ఉత్సవాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇది వినోదం, మేధోపరమైన స్ఫూర్తిని కలిగించే కార్యక్రమాలు, అద్భుతమైన ప్రో షోలు కలయికగా జీవితాంతం గుర్తుండిపోయే అనుభూతిని అందిస్తోంది. స్ప్రింగ్ స్ప్రీలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అంశాల్లో ఒకటి ప్రో షోలు. ఇందులో ప్రముఖ కళాకారులు ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ఈ ప్రదర్శనలు విద్యార్థులతో పాటు వరంగల్ నలుమూలల నుంచి ప్రజలను ఆకర్షించనుంది. అదే విధంగా గిన్నిస్ వరల్డ్ రికార్డు హోల్డర్, పద్మశ్రీ డాక్టర్ కె.బ్రహ్మానందం ప్రధాన అతిథిగా హాజరై విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించనున్నారు. మార్చి 1న భారతీయ రాక్ బ్యాండ్ 'వార్టెక్స్' వారి విభిన్నమైన ఫ్యూజన్ మ్యూజిక్‌తో ప్రేక్షకులను అలరించనుంది. అలాగే, రెండు సినిమా బృందాలు విద్యార్థులతో ప్రత్యక్షంగా ముఖాముఖి చర్చలో పాల్గొంటాయి. మార్చి 2న మూడో రోజు ప్రముఖ గాయకుడు అమిత్ త్రివేది తన సంగీత ప్రదర్శనతో సందడి చేయనున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com